# మాస్టర్ ప్లాన్ రద్దు

- మంత్రి కేటీ రామారావు హామీ
- గతంలోనే ప్రభుత్వం ప్రకటించిందన్న కేటీఆర్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌తో కామారెడ్డి రైతు జేఏసీ భేటీ
- రైతు సంక్షేమమే మా ప్రభుత్వ విధానం
- అన్నదాతలకు నష్టం జరుగనివ్వబోమని కేటీఆర్ ప్రకటన
- పాత మాస్టర్‌ప్లాన్ ప్రకారమే నడుచుకుంటామని స్పష్టీకరణ
- రైతులపై కేసులు ఎత్తివేసేలా చర్యలు తీసుకుంటామని హామీ
- కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపిన రైతు జేఏసీ ప్రతినిధులు



మంత్రి కేటీఆర్‌కు మొక్కను అందిస్తున్న కామారెడ్డి మాస్టర్ ప్లాన్ రైతు జేఏసీ రైతు నాయకులు

నిజామాబాద్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రైతన్నలకు నష్టం వాటిల్లే మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనలను రద్దు చేస్తున్నట్లు గతంలోనే రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించగా.. తాజాగా ఇదే అంశాన్ని రాష్ట్ర పురపాలక మంత్రి కేటీఆర్ మరోసారి స్పష్టం చేశారు. మాస్టర్ ప్లాన్ పాతదే అమల్లో ఉంటుందంటూ కేటీఆర్ స్వయంగా హామీ ఇవ్వడంతో కామారెడ్డి రైతు జేఏసీ హర్షం వ్యక్తం చేస్తున్నది. భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌తో కామారెడ్డి రైతు జేఏసీ బృందం శనివారం హైదరాబాద్‌లో భేటీ అయ్యింది. మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనపై చర్చ రాగా వెంటనే రద్దు చేస్తున్నట్లు ఈ సందర్భంగా కేటీఆర్ స్పష్టం చేశారు. ఇప్పటికే రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని మాస్టర్ ప్లాన్‌ని రద్దు చేస్తున్నట్లు గతంలోనే మున్సిపల్ శాఖ చేసిన ప్రకటనను పురపాలక మంత్రి కేటీఆర్ గుర్తు చేశారు. రైతుల సమావేశం సందర్భంగా మరోసారి డీటీసీపీ అధికారులతో కేటీఆర్ మాట్లాడారు. ప్రస్తుతం అమలులో ఉన్న పాత మాస్టర్ ప్లాన్ ప్రకారమే నడుచుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా తాము అండగా ఉంటామని వారికి కొండంత భరోసాను కేటీఆర్ అందించారు. ఇప్పటికే మాస్టర్ ప్లాన్ రద్దుకు సంబంధించి మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసిందని చెప్పారు. మాస్టర్ ప్లాన్ రద్దు చేస్తున్నట్లు తెలిపిన కేటీఆర్‌కు రైతు జేఏసీ నాయకులంతా ధన్యవాదాలు తెలిపారు. కేటీఆర్ హామీపై పూర్తి భరోసా తమకు ఉందని రైతు జేఏసీ వెల్లడించింది. రైతు జేఏసీ తరపున నిరసన కార్యక్రమాల సందర్భంగా నమోదైన కేసులను కూడా సానుకూలంగా పరిశీలించి ఎత్తేసే చర్యలు తీసుకుంటామని కేటీఆర్ హామీ ఇచ్చారు. ఈ మేరకు స్థానిక జిల్లా ఎస్పీ నుంచి వివరాలను కేటీఆర్ తెలుసుకున్నారు. ఈ అంశంలో రాష్ట్ర డీజీపీతోనూ కేటీఆర్ మాట్లాడారు.

**రైతన్నకు ఏనాడూ కష్టం రానివ్వని కేసీఆర్**

రైతులకు నేనున్నానంటూ ముందుండే సీఎం కేసీఆర్ తన పదేండ్ల పాలనలో ఏనాడు ఏ చిన్న కష్టాన్ని రానివ్వలేదు. దేశ వ్యాప్తంగా తెలంగాణ మినహా అనేక రాష్ట్రాల్లో అన్నదాతలు పడరాని కష్టాలు పడుతున్నారు. కరెంట్ లేక, సాగు నీరు అందక, ఎరువులు, విత్తనాలు సమయానికి చేరక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెట్టుబడికి పైసల్లేక అప్పులు చేసి చితికి పోతున్నారు. కానీ తెలంగాణలో మాత్రం రైతుల పరిస్థితి వేరు. రైతు బంధు రూపంలో పెట్టుబడి సాయంతో మొదలు పెడితే సాగుకు 24గంటల ఉచిత విద్యుత్ వరకు కేసీఆర్ సహాయ, సహకారాలు అందిస్తున్నారు. కేసీఆర్ పరిపాలన.. రైతు ప్రభుత్వంగా గుర్తింపు పొందింది. కానీ ప్రతిపక్ష పార్టీలు చీటికి మాటికి బురద రాజకీయాలతో బీఆర్ఎస్ ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇందులో భాగంగానే మాస్టర్ ప్లాన్ అంశంతో రైతుల మనోభావాలను ముడిపెట్టి రెచ్చగొట్టి గొడవలకు దారి చూపుతున్నాయి. అన్నదాతలకు కష్టం వా టిల్లే మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనలను రద్దు చేస్తున్నట్లుగా గతంలోనే రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించగా తాజాగా ఇదే అంశాన్ని శనివారం హైదరాబాద్‌లో పురపాలక మంత్రి కేటీఆర్ మరోసారి స్పష్టతను ఇచ్చారు. మాస్టర్ ప్లాన్ పాతదే అమల్లో ఉంటుందంటూ కేటీఆర్ స్వయంగా హామీ ఇవ్వడంతో కామారెడ్డి రైతు జేఏసీ హర్షం వ్యక్తం చేస్తోంది.

**పది నెలల క్రితమే తీర్మానం ఆమోదం**

కామారెడ్డి మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్ ముసాయిదాను 2023, జనవరిలోనే పాలకవర్గం రద్దు చేస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. మొత్తం 49 మంది కౌన్సిలర్లు ఉన్న మున్సిపాలిటీలో సభ్యులంతా మూకుమ్మడిగా ముసాయిదా రద్దుకే మద్దతు తెలిపి తీర్మానాన్ని ప్రభుత్వానికి పంపించింది. కేసీఆర్ ప్రభుత్వం రైతు కేంద్రంగా అనేక పథకాలను తీసుకు వచ్చి రైతును రాజు చేస్తున్న తరుణంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మాత్రం కుటిల రాజకీయాలతో బద్నాం చేసే కుట్రలకు దిగుతోంది. ఇందుకు కామారెడ్డి మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్‌పై బీజేపీ ఆడిన ఆటలే ఇందుకు నిదర్శనం. అభ్యంతరాలు చెప్పకుండా కేవలం బీఆర్ఎస్ సర్కారును ఇబ్బంది పెట్టేందుకు రైతులను పావుగా వాడుకుని పబ్బం గడిపింది. ఎన్నికల్లో నేరుగా గెలవలేక మరోసారి ఇదే డ్రామాలకు ప్రతిపక్ష పార్టీలు తెరలేపడంపై ప్రజలంతా ఆ పార్టీలను చీత్కరిస్తున్నారు.

# కామారెడ్డిలో జైత్రయాత్ర

## 'గంప' ఆధ్వర్యంలో భారీగా చేరికలు




కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

కామారెడ్డి, అక్టోబర్ 28 : ముఖ్యమంత్రి కేసీఆర్ పోటీ చేస్తున్న కామారెడ్డి నియోజకవర్గంలో కారు జోరు కొనసాగుతున్నది. కాంగ్రెస్, బీజేపీల నుంచి నిత్యం వందలాది మంది గులాబీ గూటికి చేరుతున్నారు. తాజాగా శనివారం మరో 500 మందికి పైగా బీఆర్ఎస్‌లో చేరారు. కామారెడ్డిలోని బృందావన్ గార్డెన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో టౌన్ పరిధిలోని టేక్రియాల్, భిక్కనూర్ మండలం బస్వాపూర్, జంగంపల్లి, అంతంపల్లి, దోమకొండ మండలం లింగుపల్లి, ముత్యంపేట్ గ్రామాలకు చెందిన సుమారు 500 మందికి పైగా పార్టీలో జాయిన్ అయ్యారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబుద్దీన్, ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తిరుమల్‌రెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం గంప గోవర్ధన్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్సే మళ్లీ అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ మూడోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని తెలిపారు. తెలంగాణలో అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేవన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, బీఆర్ఎస్ నాయకులు గండ్ర మధుసూదన్ రావు, దోమకొండ జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, టేక్రియాల్, భిక్కనూర్, దోమకొండ మండలాల నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

**కలెక్టర్ జితేశ్ వీ పాటిల్**

కామారెడ్డి, అక్టోబర్ 28 : ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమని, బాధ్యతాయుతంగా పని చేయాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో కామారెడ్డి నియోజకవర్గానికి చెందిన పీవోలు, ఏపీవోలకు శనివారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో 50 మందికి ఒక మాస్టర్ ట్రైనీ చొప్పున 500 మంది పీవోలు, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోలింగ్ సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు కీలకంగా వ్యవహరించే పీవోలు, ఏపీవోలు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వీవీ ప్యాట్స్ వినియోగం తీరుపై సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే సెక్టోరల్ అధికారులను సంప్రదించాలని, సొంత నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, డీఈవో రాజు, తహసీల్దార్ లత, పీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

**ప్రసూతి మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలి..**

ప్రసూతి మరణాలు సంభవించకుండా వైద్యాధికారులు ముందస్తుగా హైరిస్కుతో బాధపడుచున్న గర్భిణులను గుర్తించి తగు వైద్య సహాయం అందిస్తూ పర్యవేక్షిస్తుండాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశంలో ప్రసూతి మరణాల నియంత్రనకు తీసుకోవాల్సిన చర్యలపై శనివారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. బీపీ, రక్తహీనత, గుండె జబ్బులు తదితర కారణాలతో ప్రసవ సమయంలో తల్లి లేదా బిడ్డ చనిపోతున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా దవాఖాన సూపరింటెండెంట్ విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

# వచ్చే నెల 7లోగా 'పోస్టల్ బ్యాలెట్' ఫారం సమర్పించాలి

**నిజామాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు**



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ స్పోర్ట్స్, అక్టోబర్ 28 : పోస్టల్ బ్యాలెట్ వినియోగించే వారు నవంబర్ 7వ తేదీలోగా ఫారం-12(డీ) భర్తీ చేసి సంబంధిత రిటర్నింగ్ అధికారులకు అందజేయాలని నిజామాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో శనివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. 80 సంవత్సరాల వయస్సు పై బడిన సీనియర్ సిటిజన్లకు, 40 శాతానికిపైగా వైకల్యం ఉన్న దివ్యాంగులకు, కొవిడ్ పాజిటివ్ కలిగిన వారికి ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకునే వెసులుబాటు ఉందని తెలిపారు. అత్యవసర సర్వీసులకు చెందిన వారికి, ఎన్నికల కమిషనర్ ద్వారా మీడియా పాస్‌లు కలిగిన జర్నలిస్టులకు కూడా ఈ ఎన్నికల్లో ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించిందని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న వారు ఆర్‌వో కార్యాలయానికి వెళ్లి పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయాల్సి ఉంటుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి, పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, నోడల్ అధికారి తిరుమల ప్రసాద్, వేణు, అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళికి అనుగుణంగా వ్యవహరించాలి

రాష్ట్ర శాసన సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళికి అనుగుణంగా వ్యవహరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులకు సూచించారు. కలెక్టరేట్‌లో ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులతో శనివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రింటింగ్ ప్రెస్ యజమానులు ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 127 ఏ ప్రకారం ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు లోబడి, రాజకీయ పార్టీల ప్రచార ముద్రణ పనులు చేయాలని సూచించారు. పోస్టర్లు, కరపత్రాలు, ఇతర ప్రచార సామగ్రి ముద్రించుటకు ముందుగా ఇద్దరు వ్యక్తులు తనకు పబ్లిషర్ తెలిసినట్లు ధ్రువీకరించి ఇచ్చిన డిక్లరేషన్ కాపీలు పొందిన తర్వాతే ముద్రణకు చర్యలు చేపట్టాలని అన్నారు. ముద్రణలపై ప్రింటింగ్ ప్రెస్ పేరు, చిరునామా, సెల్ నంబర్, ప్రతుల సంఖ్య తదితర వివరాలు ఉండాలని సూచించారు. ప్రింటింగ్ ప్రెస్ వివరాలు లేకుండా, నిర్దేశ సంఖ్యకు మించి ముద్రించినా చట్టరీత్యా చర్యలు ఉంటాయని ఆదేశించారు.